# ప్రచార ఊసేదీ..!

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఆవహించిన నైరాశ్యం
- అభ్యర్థులు ఖరారు అయిన చోటా కరువైన ప్రచారం
- టికెట్ ఆశించి భంగపడ్డ నేతల నుంచి సహకారం కొరవడడమే కారణం
- నేతల తీరుతో క్యాడర్‌నూ వీడని నిస్తేజం
- రంగారెడ్డి జిల్లాలో కారు స్పీడుకు కుదేలవుతున్న ప్రతిపక్ష పార్టీలు



రంగారెడ్డి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. కానీ.. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీకంటే వెనుకంజలోనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి స్థానాలకు, బీజేపీ మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. అయినప్పటికీ ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారం ఊసేలేదు. టికెట్ ఆశించి భంగపడ్డ నేతల నుంచి సహకారం కొరవడడంతో పాటు ఓటమిని ముందుగానే ఊహించి ప్రచారం చేయడం లేదని తెలుస్తున్నది. ఫలితంగా..క్యాడర్‌నూ నిస్తేజం ఆవహించి ప్రచార సందడే కరువైనది. హ్యాట్రిక్ నినాదంతో బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే..కాంగ్రెస్, బీజేపీలు పోటీ ఇవ్వడం సంగతి పక్కన పెడితే.. కనీసం ప్రచారంలోనూ అభ్యర్థులు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## నేతల్లో అసహనం.. క్యాడర్‌లో అసంతృప్తి..

ఎన్నికల ప్రచారాన్ని భుజాన వేసుకోవాల్సిన రాష్ట్ర స్థాయి నేతలు ఢిల్లీకే పరిమితమయ్యారు. నియోజకవర్గాల్లో పర్యటించేందుకు రాష్ట్రస్థాయి నేతలెవ్వరూ రాకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఒకింత అసహనం నెలకొన్నది. బరిలో ఉన్నామా? అంటే ఉన్నాం! అన్న ట్లుగా వారు వ్యవహరిస్తున్నారు తప్ప అభ్యర్థుల్లో సీరియస్‌నెస్ కనిపించడంలేదన్న విమర్శలున్నాయి. టికెట్లు ఖరారైన అభ్యర్థుల్లో కొందరు ఇప్పటికీ క్షేత్రస్థాయిలోకే వెళ్లలే దు. అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నాలను ఆయా పార్టీల అధిష్ఠానాలు చేయకపోవడం తో నేటికీ నేతలు ఎవరికి వారే! అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రచార సందడి లేక క్యాడర్ లోనూ నిస్తేజం అలుముకోవడంతో నేతలపై పార్టీశ్రేణులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

## కనిపించని అభ్యర్థులు..

చేవెళ్ల అభ్యర్థిగా భీంభరత్, షాద్ నగర్‌కు శంకరయ్యను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇప్పటివరకు భీం భరత్ ప్రచారాన్ని ప్రారంభిం చలేదు. టికెట్ కోసం ప్రయత్నించిన నేతల్లో అసంతృప్తి జ్వాల లు చల్లారకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. ఆశావహుల్లో ఒకరైన రాచమళ్ల సిద్ధేశ్వర్ ఎన్నికల బరిలో ఉంటానని ఇప్పటికే ప్రకటించారు. మిగిలిన ఇద్దరు నేతలూ షాబాద్ దర్శన్, వసంతం ప్రచారానికి దూరంగానే ఉంటున్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి శంకరయ్య పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇటీవలే ఇద్దరు జడ్పీటీసీలతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యా రు. కొత్తగా చేరిన వారితో ఇన్నాళ్లుగా పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతుండడం శంకరయ్య కు తలనొప్పిగా మారింది. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ సైతం శంకరయ్య ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కల్వకుర్తిలోనూ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచారం చేస్తున్నప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారు. మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ బరిలో ఉన్నామంటే ఉన్నామనే రీతిలోనే ప్రచారం చేస్తున్నారు. అనూహ్యంగా టికెట్‌ను దక్కించుకున్న ఇబ్రహీంపట్నం బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ ఇప్పటి వరకు ప్రచారాన్నే మొదలుపెట్టలేదు. టికెట్ దక్కని నేతలు దయానంద్‌కు సహకరించే పరిస్థితులు కనబడడం లేదు. దీంతో ఆయన ఒంటరిగానే ప్రచారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి ప్రచారం కూడా మొక్కుబడిగానే సాగుతున్నది.

## అక్కడ.. ఇంకా ఎదురుచూపులే..

రంగారెడ్డి జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ఒక విడుత నియోజకవర్గాలను చుట్టేసి వచ్చారు. మలి విడుత ప్రచారంతో దూసుకుపోతుండగా.. ఇంకా కొన్ని నియోజకవర్గాలకు కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులనే ఖరారు చేయలేదు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు పోటీ ఎక్కువగా ఉండగా వర్గ విభేదాలు భగ్గుమనే పరిస్థితి ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంలో వెనుకంజ వేస్తున్నది. ఇక చేవెళ్ల, షాద్ నగర్ నియోజకవర్గాలకు సైతం బీజేపీ ఇప్పటివరకు అభ్యర్థులను తేల్చలేదు. క్యాడర్ లేక సతమతమవుతున్న బీజేపీకి సరైన అభ్యర్థులు లేకనే తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో రెండు పార్టీల నేతల క్యాడర్ సైతం అసంతృప్తిగానే ఉన్నది.



కొడంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కర్ణాటక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ ర్యాలీ తీస్తున్న ఆ రాష్ట్ర రైతులు

### మేమే సాక్ష్యమంటున్న కర్ణాటక రాష్ట్ర రైతులు

# కాంగ్రెస్ మోసం గ్యారంటీ

- కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మా బతుకులు ఆగమవుతున్నయ్
- ఐదు పద్దుల హామీలు బూటకం.. కరెంటు లేక ఎండుతున్న పంటలు
- మేము కాంగ్రెస్‌ను నమ్మి గోస పడుతున్నాం.. మీరు నమ్మొద్దు
- కొడంగల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ కర్ణాటక రైతుల ర్యాలీ
- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, అక్టోబర్ 25: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతుల బతుకులు ఆగమవుతున్నాయని... మాలా తెలంగాణ రైతులు బాధలు పడొద్దంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హస్తం పార్టీకి ఓటు వేయొద్దని కర్ణాటక ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని కొంతన్‌పల్లి, మల్లాబాద్, సిలార్‌కోట్రికె, నాడెపల్లి, పాకాల్, కానడగడ్డ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కొడంగల్ పట్టణంలోని మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించి దారి పొడవునా కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దు.. కర్ణాటకలో ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా నెరవేర్చడంలేదని.. అక్కడ రైతులకు ఆత్మహత్యలే శరణ్యమంటూ నినాదాలు చేశారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి.. ఎన్నికల్లో ఓటేసి గెలిపించుకుంటే.. ప్రభుత్వం ఏర్పడి కొన్ని నెలలైనా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క దానినీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కనీసం ఎనిమిది గంటలైనా విద్యుత్తు సరఫరా అయ్యేదని కనీసం ఒక్క పంటనైనా పండించుకునే వాళ్లమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడు గంటలపాటు కరెంట్ ఇస్తామని ఎన్నికల్లో ప్రచారం చేశారని.. కానీ.. ప్రస్తుతం మూడు గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో ఆ విద్యుత్తుతో పంటలకే కాకుండా ఇంట్లో కూడా కరెం టు కష్టాలు తప్పడంలేదని, పిల్లల చదువు కూడా సాగడం లేదన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అన్న హామీ అటకెక్కిందని.. మహిళలు కొప్పులు పట్టుకొని కొట్టుకొంటున్నట్లు పేర్కొన్నారు. బస్సు ఎక్కే క్రమంలో ఇద్దరు మహిళలు ఇప్పటికే చనిపోయినట్లు ఆరోపించారు. పేదలకు పది కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పి మూడు కిలోలు మాత్రమే సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో పేదలు అర్ధాకలితో అలమట్టిస్తున్నారని కర్ణాటక ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చెప్పుకునేందుకు మాత్రమే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అని.. ఆపైన వచ్చే బిల్లుకు రెండు రెట్లు అదనంగా బిల్లులు వసూలు చేసి రైతులను ప్రభుత్వం దోచుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన యువనిధి పథకం హామీగానే మిగిలిపోయిందని.. నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ లేని పథకాలను ప్రవేశపెట్టి కన్నడ ప్రజలను అన్ని విధాలా మోసం చేసిందన్నారు.

### తెలంగాణవాసులు అదృష్టవంతులు

తెలంగాణ ప్రజలు ఎంతో అదృష్టవంతులని సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అండగా నిలుస్తున్నారని కర్ణాటక ప్రాంత రైతులు కొనియాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయని పేర్కొన్నారు. వరాలిచ్చే దేవుడు లాంటి సీఎం కేసీఆర్‌ను ప్రజలు మళ్లీ గెలిపించుకోవాలని.. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణవాసులకు చీకటి రోజులు తప్పవని హెచ్చరించారు. మేము పడుతున్న ఇబ్బందులు తెలంగాణ ప్రజలు పడొద్దనే సదుద్దేశంతోనే కొడంగల్‌కు వచ్చి వివరిస్తున్నట్లు కర్ణాటక ప్రాంత రైతులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని, ఆలోచించకుండా కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమేనని సూచించారు.



కొడంగల్‌లో కర్ణాటక రాష్ట్ర రైతులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

### రైతులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

తాము పడుతున్న బాధలను తెలంగాణ ప్రజలకు వివరించేందుకు వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు తమను అడ్డుకుని.. ప్లకార్డులను విరగ్గొట్టారని కర్ణాటక ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో జరుగుతున్న బాగో తం బయటపడుతుందనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు తమను అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెసోళ్లకు భయపడకుండా మా గోడును తెలంగాణ ప్రజలకు వినిపిస్తామని.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే ఈ విధంగా దౌర్జన్యం ఉంటే అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలా ఉంటుందో తెలంగాణవాసులు ఆలోచించాలని పేర్కొన్నారు. మేం మోసపోయాం.. మీరూ మోసపోవద్దనే సదుద్దేశంతోనే కొ డంగల్‌కు వచ్చామని.. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించి ..ప్రజల కోసం పని చేసే సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్నే మరోసారి గెలిపించాలని సూచించారు.



కాంగ్రెస్ హామీలు బోగస్ అంటూ నినాదాలు చేస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువ రైతు



# జై మాతా..

తొమ్మిది రోజులపాటు నగరవాసుల పూజలందుకున్న దుర్గామాత భక్తుల భారీ ఊరేగింపులు, జయ జయ ధ్వానాల నడుమ నగర వాసుల సేవలందుకుంటూ బుధవారం హుస్సేన్‌సాగరంలో గంగమ్మ సన్నిధికి చేరుకున్నారు.

### వైభవంగా ముగిసిన దేవీ నవరాత్రులు



### బేజారవుతున్న క్యాడర్

# అభ్యర్థులను ఖరారు చేయని ప్రతిపక్షాలు

- బలమైన నాయకత్వం ఉన్న బీఆర్ఎస్ వైపు ఆయా పార్టీల క్యాడర్ చూపు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్, బీజేపీలు తర్జన భర్జన పడుతున్నాయి. దీంతో ఆ పార్టీల క్యాడర్ బీఆర్ఎస్‌లోకి వస్తున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డాం ఎమ్మెల్యే అభ్యర్థినంటూ నియోజకవర్గంలో తిరిగిన వాళ్లు చాలా మంది ఉన్నారు, అలాంటిది వారి వారి నాయకులకు టిక్కెట్టు రాదనే తేలిపోతుండటంతో ఒక్కొక్కరుగా కారెక్కుతున్నారు. ఎల్బీనగర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గంలో ఊహించని విధంగా అభివృద్ధి చేశారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి గతంలో ఏ పార్టీ హయాంలోనూ జరగలేదు, దీంతో స్థానిక ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అయిన ప్రస్తుత ఎమ్మెల్యేకు ఎక్కడకు వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు. ఇది ఇప్పుడు ప్రతి పక్ష పార్టీల నాయకుల్లో ఆందోళన కల్గిస్తుండటంతో... ఎవరిని పార్టీ అభ్యర్థిగా ఖరారు చేయాలనే ఇంకా చర్చలు జరుపుతున్నారు. ఇదే ఆ పార్టీ క్యాడర్‌ను నిరుత్సాహానికి గురిచేస్తున్నది. తమ నాయకుడు పేరు వస్తుందని ఆలోచనలో ఉన్న సమయంలో ప్యారాచూట్ నాయకుల పేర్లు విన్పించడం, అంతలోనే మరో నాయకుడి పేరు తెరపైకి రావడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే పార్టీలో కనీసం ఎమ్మెల్యే అభ్యర్థిని కూడా నిర్ణయించలేని పరిస్థితిలో ఉన్న పార్టీలో మనమున్నామా? అని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. బలమైన నాయకత్వం ఉన్నచోటకు వెళ్లడంతోనే గుర్తింపు, అభివృద్ధి, ప్రజలకు సేవ చేసే అవకాశాలుంటాయనే భావనలో ఆయా పార్టీల క్యాడర్ మాట్లాడుకుంటూ బీఆర్ఎస్ పార్టీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు.